రెండు లక్షల సీడ్ బాల్స్ పంపిణీకి చర్యలు

● జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా



సీడ్ బాల్స్ పంపిణీ చేస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా

సైదాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఈ వర్షాకాలంలో రెండు లక్షల సీడ్ బాల్స్(విత్తనబంతులు) పంపిణీకి కార్యచరణ సిద్ధం చేసినట్లు జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చంచల్‌గూడ జైలు పెట్రోల్ బంకులో ఐఓసీ సహకారంతో ఖైదీలతో తయారుచేసిన సీడ్ బాల్స్‌ను డీజీ వాహనాదారులకు పంపిణీ చేశారు. సీడ్ బాల్స్‌ను అటవీశాఖతో కలిసి జైలు సిబ్బంది రాష్ట్రవ్యాప్తంగా అనువైన ప్రదేశాలలో చల్లనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్ గౌడ్, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీమాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాగృతి అభ్యుదయ సంఘానికి ప్రోత్సాహక బహుమతి



మంత్రి సురేఖకు పిట్టగూళ్లను అందజేస్తున్న భావన శ్రీనివాస్

వనస్థలిపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పోటీల్లో ప్రథమ, తృతీయ స్థానంలో జాగృతి అభ్యుదయ సంఘం నిలవడం హర్షనీయమనీ ఆ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ భావన శ్రీనివాస్‌కు పోత్సహాక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భావన శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వస్తువుల కాలుష్యం, నియంత్రణ ఆవశ్యకతపై తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇటీవల నిర్వహించిన నాటక పోటీల్లో తమ సంస్థకు ప్రథమ, తృతీయ బహుమతులు రావడం సంతోషకరం అన్నారు.

మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

ఓల్డ్‌మలక్‌పేట జూన్ 5(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా రెండు రోజులు సెలవులు వచ్చాయి. శనివారం బక్రీద్ సందర్భంగా ప్రభుత్వ సెలవు, ఆదివారం సాధారణ సెలవు కావడంతో రెండు రోజులు మార్కెట్ బంద్ ఉంటుంది ఎలాంటి కొనుగోళ్లు ఉండవు. తిరిగి సోమవారం మార్కెట్ యథావిధిగా కొనసాగుతుంది. మార్కెట్‌లో శని, ఆదివారం గరుడ అభయ అంజనేయస్వామి మహాకుంబాభిషేకాలు, సీతారాముల కల్యాణోత్సవం జరుగుతున్నాయి.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అబివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీలో చెపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్-4 డీసీ సేవా ఇస్లావత్, ఏఈ విగ్నేశ్వరీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ కాలనీవాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

రూ.64లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

చాదర్‌ఘాట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో సుమారు రూ.64లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. గురువారం ఆమె డివిజన్ పరిధిలోని గడ్డిఅన్నారం రెడ్ క్రాస్ ఆస్పత్రి ముందు సీసీరోడ్డు నిర్మించేందుకు రూ.15లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎంఆర్‌ఆర్ బార్‌లేన్‌లో రూ.19లక్షల వ్యయంతో, సలీంనగర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముందు లేన్‌లో రూ.21లక్షల వ్యయంతో, శాలివాహననగర్ కాలనీలోని భాష్యం స్కూల్ చౌరస్తాలో రూ.9లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు కార్పొరేటర్ వివరించారు. ఈ నాలుగు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌కుమార్ పటేల్, మాజీ అధ్యక్షుడు యాదగిరి, సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి'

ఎల్బీనగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలో పని చేస్తూ మృతిచెందిన పారిశుధ్య సూపర్‌వైజర్ యాదగిరి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు గురువారం సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎల్బీనగర్ సర్కిల్ ఉపకమిషనర్ వేధింపులతోనే మానసికంగా కృంగిపోయిన యాదగిరి గుండెపోటుతో మృతిచెందాడని ఏఐటీయూసీ ఎల్బీనగర్ మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి మద్దిలేటి ఆరోపించారు. యాదగిరి కుటుంబానికి 25 లక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపకమిషనర్‌పై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు దర్శన్‌కుమార్, యాదమ్మ, వినయ్, అంజమ్మ, అనిత, సుజాత, పోచమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

వనస్థలిపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం టీటైం కాంప్లెక్స్‌లో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న సురేష్, నవ్యను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి శివకుమార్(4), సాయి శంకర్(2), చెర్రీ(4 నెలలు) ముగ్గరు సంతానం. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు తాళలేని నవ్య గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో వెంటిలేటర్ గ్రిల్‌కు చీరతో ఉరివేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. సంగటనాస్థలానికి చేరుకున్న పోలీసులు తలుపు బద్దలు కొట్టి చూడగా నవ్య అప్పటికే మృతిచెందింది. మృతురాలి తండ్రి వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళా పోలీసులు చిన్నారులను శిశువిహార్‌కు తరలించారు.

మూడు రోజుల్లో నిశ్చితార్థం.. డాక్టర్ అదృశ్యం



సాయిరాం

సైదాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల్లో నిశ్చితార్థం ఉండగా యువ డాక్టర్ అదృశ్యమయ్యాడు. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాబాద్ కాలనీలో నివాసముండే కావేటి రామకృష్ణ కుమారుడు సాయిరాం(32) ఎంబీబీఎస్ పూర్తి చేసి తాడేపల్లిలోని సిమెంట్ ఫ్యాక్టరీలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం డాక్టర్ నిశ్చితార్థం ఉండగా మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో కోఠిలోని ఐఎంఏలో మెడికల్ సర్టిఫికెట్ రెన్యూవల్ చేయించుకుంటానని ఇంట్లో చెప్పివెళ్లాడు. ఎంతకు తిరిగి రాలేదు. అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఎక్కడ వెతికినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో తండ్రి సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రంగారెడ్డి జిల్లా కోర్టులో నిర్వహించిన ప్రదర్శనలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు



రెవెన్యూ బోర్డు కాలనీలో మొక్కను నాటుతున్న ఎన్ఐఐఎంహెచ్ ప్రతినిధులు



మన్సూరాబాద్ పెద్దచెరువు వద్ద మొక్కను నాటుతున్న పర్యావరణ పరిరక్షణ జిల్లా కమిటీ కన్వీనర్ నాగపరిమిల, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీ పార్కులో మొక్కను నాటుతున్న కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



న్యూ నాగోల్‌లో మొక్కను నాటుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి అధ్యక్షులు అశ్వినీ ఆంజనేయులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కల్పించి, మొక్కలు నాటారు.

- **సైదాబాద్:** గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ ఆసోసియేషన్ (ఎన్ఐఐఎంహెచ్) ఆధ్వర్యంలో రెవెన్యూ బోర్డు కాలనీ పార్కులో మొక్కలు నాటారు.
- **రంగారెడ్డి జిల్లా కోర్టులు:** రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ పాల్గొని మొక్కలు నాటారు.
- **మన్సూరాబాద్:** జిల్లా పర్యావరణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.
- నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ఓపెన్ జిమ్ పార్కు ఆవరణలో మొక్కలు నాటారు.
- వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లలో పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని రాసిన ఫ్లకార్డులను పట్టుకుని కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి అధ్యక్షులు అశ్వినీ ఆంజనేయులు అవగాహన కల్పించారు.
- **హయత్‌నగర్:** వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటిలోని మన్నెగూడలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్కులు మొక్కలు నాటి మానహారం నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల ప్రపంచ మానవాళికి కలుగుతున్న నష్టాన్ని వివరించారు.
- **కొత్తపేట:** బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో న్యూ నాగోల్‌లో చేపట్టిన కార్యక్రమంలో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ పల్గొని మొక్కలు చేపట్టారు.
- **చంపాపేట:** హస్తినాపురం డివిజన్ భూపేష్‌గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.
- **అబ్దుల్లాపూర్‌మెట్:** పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని ఈధుల చెరువు కట్టపై మున్సిపల్ కమిషనర్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, మేనేజర్ కిరణ్‌కుమార్, డీఈఈ సుమంత్, ఆర్ఐ హరికుమార్ అధికారులు మొక్కలను నాటారు. చెరువులోకి చేరిన వ్యర్థాలను సిబ్బంది తొలగించారు.
- **సరూర్‌నగర్,:** వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్లలో కమిషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో 15 అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు కట్టపై మొక్కలు నాటి నీరు పోశారు.
- మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లలో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం జిల్లెలగూడలోని చందచెరువు కట్టపై డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి నీరు పోశారు.



హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ కోర్టు ప్రాంగణంలో మొక్కను నాటుతున్న రంగారెడ్డి జిల్లా అదనపు మొదటి జూనియర్ సివిల్ జడ్జి నర్మద, మార్నింగ్ కోర్టు జడ్జి లక్ష్మణ్‌రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్, న్యాయవాదులు



మన్నెగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ సిబ్బంది



భూపేష్‌గుప్తానగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కను నాటుతున్న బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ తదితరులు



ఈధుల చెరువు కట్టపై మొక్కను నాటి నీరు పోస్తున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి తదితరులు



అల్మాస్‌గూడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ సరస్వతి, ఏఎంసీ శ్యాంసుందర్



మీర్‌పేట్‌లో మొక్కను నాటి నీరు పోస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్, అధికారులు

రైతులపై దాడులు చేస్తే ప్రతి దాడులు తప్పవు : శ్రీరాములుయాదవ్



పోలీసులతో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

సరూర్‌నగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నాదర్‌గుల్‌లోని కాసువాగు(సర్వే నం.119)కు సంబంధించిన ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన రైతులపై కొందరు కబ్జాదారులు దాడులు చేయడం తగదని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ప్రతి దాడులు తప్పవని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ హెచ్చరించారు. నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, రాగన్నగూడ గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములను కొందరు కబ్జాదారులు ఆక్రమించుకుని, రైతులు అక్కడికి రాకుండా అడ్డుకుంటున్నారని, అలాంటి ప్రయత్నాలను వెంటనే ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. బుధవారం ఓ రైతు తన పొలంలోకి వెళ్లగా అక్కడి కబ్జాదారులు దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు. గురువారం ఆయనను పరామర్శించడానికి శ్రీరాములుయాదవ్ బయలుదేరుతుండగా ఆదిభట్ల పోలీసులు ఆయన నివాసానికి చేరుకుని హౌజ్ అరెస్టు చేశారు. దాంతో బీజేపీ శ్రేణులు భారీగా అక్కడకు చేరుకున్నారు. మరోపక్క సర్వే నం. 119లోని భూమి వద్దకు రైతులు వెళ్లనున్నారనే సమాచారం మేరకు పోలీసులు అక్కడ పికెట్ ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ, ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ తదితరులు శ్రీరాములుతో చర్చలు జరిపారు. రైతులపై దాడులు జరుగకుండా చూస్తామని, దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో శ్రీరాములుయాదవ్ తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

బక్రీద్‌కు భారీగా ఏర్పాట్లు

చాదర్‌ఘాట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా జంతు కళేబరాల తొలగింపునకు జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ రుద్ర తెలిపారు. బక్రీద్ సందర్భంగా జంతువుల కళేబరాల తొలగింపు కోసం మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో 64 లిఫ్టింగ్ పాయింట్లను ఏర్పాట్లు చేసినట్లు ఏఎంహెచ్‌వో తెలిపారు. సమస్యాత్మకమైన ప్రాంతాల్లో 18 లిఫ్టింగ్ పాయింట్లను గుర్తించి అక్కడ ఎప్పటికప్పుడు తొలగించేందుకు రౌండ్ ది క్లాక్‌గా శానిటేషన్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. జంతువుల కళేబరాలను వేసేందుకు శుక్రవారం నుంచి మసీద్‌ల వద్ద దాదాపు 37వేల కవర్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆజంపుర, ఓల్డ్‌మలక్‌పేట, చావునీ, అక్బర్‌బాగ్, సైదాబాద్, ముసారాంబాగ్, డబీర్‌పుర కార్పొరేటర్ల పర్యవేక్షణలో మసీద్‌ల వద్ద కవర్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. జంతువుల కళేబరాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు వీలుగా మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో 28 భారీ వాహనాలను రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు చేశారు. మరో 11 ఎక్స్‌కవేటర్లను సిద్ధం చేశారు. 10టన్నర్స్ భారీ వాహనాలు 18, మినీ టిప్పర్లు మరో 8 11 ఎక్స్‌కవేటర్లను సిద్ధం చేశారు.

'మాలలకు రెండు మంత్రి పదవులు కేటాయించాలి'

చాదర్‌ఘాట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో రెండు మంత్రి పదవులు మాలలకు కేటాయించాలని మాల విద్యార్థి సంఘం నాయకులు అరుణ్‌కుమార్, రెన్నయ్య డిమాండ్ చేశారు. గురువారం ముసారాంబాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలంగాణ ఉద్యమకారుడని, తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని వివేక్ దీక్ష చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. సీబీఎం ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్న డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు మంత్రి పదవి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సంతోష్, నర్సింహ, సురేష్, హర్ష, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యా ప్రమాణాలను పెంచేందుకే శిక్షణ'

సైదాబాద్. జూన్ 5(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాల పెంపునకు, మెళకువలను అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో మేలు చేస్తుందని సైదాబాద్ మండల ఉప విద్యాశాఖాధికారి టి.రాధాకృష్ణ అన్నారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్ఎం సైదాబాద్ మండల రికగ్నైజ్ ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ (ఎస్ఎంఆర్‌పీఎస్ఏ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ట్రాన్స్‌ఫార్మింగ్ టీచర్స్ సమ్మిట్-2025 గురువారం ముగిసింది. ఈ సందర్భంగా హాజరైన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ మసూద్ అహ్మద్, ఈఎన్‌టీ డాక్టర్ లాస్య సాయినంది, అసోసియేషన్ అధ్యక్షుడు వీరేందర్ బాబు, కార్యదర్శి సత్యం, కోశాధికారి మహమూద్ ఐరిస్ సల్మాన్, మండల పరిధిలోని 40 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 320 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టస్కర్‌ను ఢీకొన్న డీసీఎం.. క్లీనర్ మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డుపై ఆగి ఉన్న టస్కర్ లారీని వెనుక నుంచి డీసీఎం వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం క్లీనర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా శంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన చాకలి యాదగిరి(40) డీసీఎంపై క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 5గంటలకు మేడ్చల్ నుంచి కోళ్ల దానాతో డీసీఎం ఔటర్ రింగ్ రోడ్డుపై ఉన్న ఇబ్రహీంపట్నంకు బయలుదేరింది. ఉదయం 8:30 గంటల ప్రాంతంలో పెద్ద అంబర్‌పేట్ ఔటర్ జంక్షన్ సమీపానికి చేరుకోగానే ముందు వెళ్తున్న మరో వాహనాన్ని డీసీఎం డ్రైవర్ ఓవర్‌టేక్ చేశాడు. అప్పటికే అక్కడ టస్కర్ లారీ ఆగి ఉంది. దానిని గమనించని డీసీఎం డ్రైవర్ నేనావత్ గణేష్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దాంతో డీసీఎంలో ఎడమవైపు కూర్చున్న క్లీనర్ యాదగిరి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కాగా, డ్రైవర్ గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైదాబాద్ పీఎస్ ఎదుట చిన్నారి మృతదేహంతో ధర్నా

సైదాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధిత కుటుంబసభ్యులతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నిందితుడిని స్టేషన్ బెయిల్‌పై ఎలా వదిలి వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి చంచల్‌గూడ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన విషయం తెలిసిందే. ఆస్మాన్‌ఘడ్ గాంధీనగర్‌కు చెందిన అబ్దుల్ అక్బర్, భార్య సీమా బేగం(26), కుమార్తెలు మదిహా(4), ఐరా(3)తో కలిసి బైక్‌పై వస్తుండగా చంచల్‌గూడ చౌరస్తాలో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీమా బేగంను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. పెద్ద కుమార్తె మదిహ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. సాయంత్రం చిన్నారి మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌లు సముదాయించేందుకు ప్రయత్నించగా వారితో వాగ్వివాదానికి దిగారు. నిందితుడికి పీఎస్‌లో తమ ముందే రాచమర్యాదలు చేసి అరెస్ట్ చేయకుండా బెయిల్ ఇచ్చి విడిచిపెట్టారని బాధితులు ఆరోపించారు. నిందితుడిని మాదన్నపేట పీఎస్‌లో ఉంచామని చెప్పి బాధిత కుటుంబసభ్యులను పోలీస్ వాహనంలో డీఐ ఆనంద్‌కుమార్ తీసుకుపోయి చూపించారు. అక్బర్‌బాగ్ కార్పొరేటర్ మినాజుద్దీన్ పోలీస్‌స్టేషన్ చేరుకుని బాధిత కుటుంబసభ్యులను సముదాయించడంతో ధర్నా విరమించారు. నిందితుడు డ్రైవర్ సైదాబాద్ జయనగర్‌కు చెందిన అబ్దుల్ సలీం(68)పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ నిర్మించండి



మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్బీనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారిపై చింతలకుంట నుంచి ఆటోనగర్ వరకు, భాగ్యలత నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వెహికల్ అండర్ పాస్ బదులుగా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి కోరారు. గురువారం వనస్థలిపురం పరిసర కాలనీల వాసులు రాంరెడ్డి నాయకత్వంలో మంత్రి కోమటిరెడ్డిని కలిసి ఫ్లైఓవర్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంకటరెడ్డి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నెల 11,12 తేదీలలో డిల్లీకి వెళ్లి ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఘన వ్యర్థాల నిర్వహణలో తుర్కయంజాల్‌కు అవార్డు



అమరేందర్‌రెడ్డికి అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి సురేఖ

హయత్‌నగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణలో తుర్కయంజాల్ మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.

డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన చైతన్యకుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న డీసీపీ చైతన్యకుమార్

సైదాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సౌత్ ఈస్ట్ జోన్ నూతన డీసీపీగా ఎస్.చైతన్యకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీసీపీ కాంతిలాల్ సుభాష్ పాటిల్ బదిలీపై కొమురం భీం ఆసీఫాబాద్ జిల్లాకు ఎస్పీగా వెళ్లారు. హైదరాబాద్ సిటీ స్పెషల్‌బ్రాంచ్ డీసీపీగా ఉన్న చైతన్యకుమార్ సౌత్ ఈస్ట్ జోన్‌కు బదిలీ అయ్యారు. నూతన డీసీపీని జోన్ పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు కలిసి అభినందనలు తెలిపారు.



ముజఫర్ హుస్సేన్ భౌతికకాయానికి నివాళులర్పించిన అక్బరుద్దీన్ ఒవైసీ

ముజఫర్ హుస్సేన్‌కు నేతల నివాళి

సంతోష్‌నగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం సంతోష్‌నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్ మృతదేహాన్ని మాదన్నపేటలోని కుర్మగూడలోని స్వగృహంలో ఉంచగా పార్టీ నేతలు, కార్యకర్తలు సందర్శించారు. కాగా, ముజఫర్ హుస్సేన్ రెండుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముజఫర్ హుస్సేన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కుర్మగూడలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రజా సమస్యలపై గళమెత్తే నాయకుడని బల్దియా సమావేశాలలో కాలనీల్లో మౌలిక సదుపాయాల కోసం నిరంతరం ప్రశ్నించేవారని అన్నారు. ఆయన భౌతికకాయానికి ఎంఐఎం ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు నివాళులర్పించారు.